


అర్జున్ సమాచారం
PRGI NO: TGTEL/25/A5314
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
ఎడిటర్ : లింగం రాజయ్య
బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




మంచిర్యాల హైదరాబాద్ రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | శుక్రవారం 11, సెప్టెంబర్ 2026 | సంపుటి :1 సంచిక : 238 | పేజీలు : 8 , వెల.2.00

# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై
# అసెంబ్లీలో చర్చ..



- ప్లాంట్ల ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- అధిక వ్యయం ప్రధాన సవాల్‌గా మారింది
- కేంద్రం నిబంధనలు సడలిస్తే మరింత పెట్టుబడులు
- పారిశ్రామిక వృద్ధితో భారీగా డిమాండ్
- ఆయా గ్రామాల్లో మైక్రో గ్రిడ్‌ల ఏర్పాటుకు కసరత్తు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

తెలంగాణలో ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రిజర్వాయర్లపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం సహా పలు రిజర్వాయర్లను పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా సభ్యులు సోలార్ పవర్‌పై ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి వివరణ ఇస్తూ కీలక విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని తెలిపారు.



2లో



బ్రిక్స్ సదస్సు కోసం జిన్‌పింగ్

## భారత్‌కు వస్తారా.. ఇప్పటికీ క్లారిటీ లేదంటున్న చైనా..

బ్రిక్స్ సదస్సు ప్రారంభానికి ఇంకా 48 గంటల కంటే తక్కువ సమయమే ఉంది. అయినప్పటికీ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్ పర్యటనపై ఇంకా స్పష్టత రాలేదు. సెప్టెంబర్ 12-13 తేదీల్లో న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనుంది. అయితే జిన్‌పింగ్ భారత్‌కు వస్తారా? వస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక భేటీ ఉంటుందా? అనే అంశాలపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. చైనా విదేశాంగ శాఖను జిన్‌పింగ్ పర్యటన గురించి ప్రశ్నించగా.. తమ వద్ద ఆయన పర్యటనకు సంబంధించి అధికారిక సమాచారం లేదని తెలిపింది.

2



ఆస్తి కోసం కొడుకు చేసిన

## కుట్రలకు సుప్రీంకోర్టు చెక్.. తల్లి కాళ్లు పట్టుకోమని ఆదేశం..

ఓ వ్యక్తి మోసపూరితంగా తల్లిదండ్రుల ఆస్తిని తన సొంతం చేసుకోవాలని అనుకున్నాడు. ఇందుకోసం నకిలీ పత్రాలను తయారు చేశాడు. ఆస్తి తనదేనంటూ సుప్రీంకోర్టుకు వెళ్లాడు. తల్లిదండ్రులను మోసం చేయాలని భావించిన అతడికి సుప్రీంకోర్టు ఊహించని షాక్ ఇచ్చింది. పిటిషన్‌ను కొట్టివేయడమే కాకుండా.. తల్లి పాదాలు తాకి క్షమాపణ కోరమని అతడిని ఆదేశించింది. ఆ వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన ఓ వృద్ధ జంట ఎంతో కష్టపడి బిల్డింగ్ కట్టుకుంది. ఆ బిల్డింగ్‌లోని ఫస్ట్ ఫ్లోర్‌లో ఆ దంపతుల కొడుకు, కోడలు ఉంటున్నారు. ఆ బిల్డింగ్ మొత్తాన్ని సొంతం చేసుకోవాలని వృద్ధ దంపతుల కుమారుడికి బుద్ధి పుట్టింది.

2



ఏఐ ఫేక్ వీడియోలతో మోసాలు..

## ప్రజలకు ప్రియాంక గాంధీ ఆఫీస్ హెచ్చరిక..

సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఏఐ ఫేక్ వీడియోలను నమ్మి మోసపోవద్దని ఆమె ఆఫీస్ ప్రజలను హెచ్చరించింది. సైబర్ నేరగాళ్లు ప్రియాంక గాంధీ వాయిస్, ముఖంతో ఏఐ వీడియోలు సృష్టిస్తున్నారని పేర్కొంది.

ఉద్యోగులు, పెన్షనర్లకు

## మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం



2

ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. వారు కోరుకున్న విధంగా ఆరోగ్య సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. జులై 17 నుంచి నూతన ఈహెచ్‌ఎస్ సదుపాయం అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈహెచ్‌ఎస్ పరిధిలో 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు.



2

## శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

మంత్రి తుమ్మలపై బీజేపీ

## ఎమ్మెల్యేల ప్రశంసలు



2

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేలు పాయల శంకర్, రాకేష్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. మంత్రిగా తుమ్మల చాలా బాగా పనిచేస్తున్నారని.. తాము ఇలాంటి మంత్రిని చూడలేదని పేర్కొన్నారు. ఎప్పుడైనా ఫోన్ చేసినా తుమ్మల స్పందిస్తారని.. ఆదివారం రోజున కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. పనిలో ఉన్న సమయంలో ఫోన్ ఎత్తలేకపోయినా తిరిగి కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు.

## ఆర్టీసీని నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం: మంత్రి పొన్నం



2

ఆర్టీసీ పేద ప్రజలకు లైఫ్ లైన్ లాంటిదని తెలంగాణ రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకార్ అభివర్ణించారు. గురువారం అసెంబ్లీలో ఆర్టీసీపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. హైదరాబాద్‌లో మినీ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని చూస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 540 ఎలక్ట్రికల్ బస్సులు నడుస్తున్నాయని వివరించారు.

## కనీస వేతనాలు చెల్లించడంలో దేశానికి తెలంగాణ ఆదర్శం: మంత్రి వివేక్

హైదరాబాద్,

కనీస వేతనాలు చెల్లించడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి తెలిపారు. సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని చెప్పారు. గురువారం తెలంగాణ అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. అయితే ఇప్పటికే ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ సమస్యలపై ప్రభుత్వం కమిటీ వేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నదీమ్ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తున్నామని చెప్పారు. అందుకోసం త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి వివేక్ వెంకట స్వామి ప్రకటించారు.



# బ్రిక్స్ సదస్సు కోసం జిన్‌పింగ్ భారత్‌కు వస్తారా.. ఇప్పటికీ క్లారిటీ లేదంటున్న చైనా..

ఇంటర్నెట్ డెస్క్:

బ్రిక్స్ సదస్సు ప్రారంభానికి ఇంకా 48 గంటల కంటే తక్కువ సమయమే ఉంది. అయినప్పటికీ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్ పర్యటనపై ఇంకా స్పష్టత రాలేదు. సెప్టెంబర్ 12-13 తేదీల్లో న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనుంది. అయితే జిన్‌పింగ్ భారత్‌కు వస్తారా? వస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక భేటీ ఉంటుందా? అనే అంశాలపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. చైనా విదేశాంగ శాఖను జిన్‌పింగ్ పర్యటన గురించి ప్రశ్నించగా.. తమ వద్ద ఆయన పర్యటనకు సంబంధించి అధికారిక సమాచారం లేదని తెలిపింది. జిన్‌పింగ్ భారత్‌కు వస్తే.. ఏడు సంవత్సరాల తర్వాత ఆయన భారత పర్యటన చేసినట్లవుతుంది. జిన్‌పింగ్ భారత్ పర్యటన ఖరారైతే అందరి దృష్టి ప్రధానంగా మోదీ-జిన్‌పింగ్ ద్వైపాక్షిక సమావేశంపైనే ఉంటుంది. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సరిహద్దులో ఉద్రిక్తతలు, పరస్పర అనుమానాలు రెండు దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక సంబంధాలపై ప్రభావం చూపాయి. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య సంబంధాలను క్రమంగా మెరుగుపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత్ కూడా చైనా ఉత్పత్తులపై 2020లో విధించిన కొన్ని ఆంక్షలను సడలించింది. రెండు దేశాల మధ్య రాజకీయ విభేదాలు కొనసాగుతున్నప్పటికీ వాణిజ్య సంబంధాలు మాత్రం బలంగానే ఉన్నాయి. గత ఏడాది భారత్-చైనా ద్వైపాక్షిక వాణిజ్యం 12.4 శాతం పెరిగి 155 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరింది. పదేళ్ల క్రితం నమోదైన 71.6 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ. ఈ ఏడాది ఇప్పటివరకు ఇరు దేశాల మధ్య వాణిజ్యం రికార్డు స్థాయిలో జరిగింది. భారత్-చైనా సంబంధాలపై బీజింగ్ నుంచి వచ్చిన తాజా వ్యాఖ్యలు కూడా ఆసక్తికరంగా ఉన్నాయి . ఇరు దేశాలు పోటీదారులు కాదని, భాగస్వాములని పేర్కొంది. ఒకరి అభివృద్ధికి మరొకరు అవకాశాలు కల్పించుకుంటూ ముందుకు సాగాలని జిన్‌పింగ్, మోదీ భావిస్తున్నట్లు చైనా విదేశాంగ శాఖ పేర్కొంది. అయితే ఈ వ్యాఖ్యలకు అనుగుణంగా వాస్తవ సంబంధాలు ఎంతవరకు ముందుకు వెళ్తాయన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.

# ఆస్తి కోసం కొడుకు చేసిన కుట్రలకు సుప్రీంకోర్టు చెక్.. తల్లి కాళ్లు పట్టుకోమని ఆదేశం..

ఇంటర్‌నెట్ డెస్క్:

ఓ వ్యక్తి మోసపూరితంగా తల్లిదండ్రుల ఆస్తిని తన సొంతం చేసుకోవాలని అనుకున్నాడు. ఇందుకోసం నకిలీ పత్రాలను తయారు చేశాడు. ఆస్తి తనదేనంటూ సుప్రీంకోర్టుకు వెళ్లాడు. తల్లిదండ్రులను మోసం చేయాలని భావించిన అతడికి సుప్రీంకోర్టు ఊహించని షాక్ ఇచ్చింది. పిటిషన్‌ను కొట్టివేయడమే కాకుండా.. తల్లి పాదాలు తాకి క్షమాపణ కోరమని అతడిని ఆదేశించింది. ఆ వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన ఓ వృద్ధ జంట ఎంతో కష్టపడి బిల్డింగ్ కట్టుకుంది. ఆ బిల్డింగ్‌లోని ఫస్ట్ ఫ్లోర్‌లో ఆ దంపతుల కొడుకు, కోడలు ఉంటున్నారు. ఆ బిల్డింగ్ మొత్తాన్ని సొంతం చేసుకోవాలని వృద్ధ దంపతుల కుమారుడికి బుద్ధి పుట్టింది. ఈ నేపథ్యంలోనే నకిలీ పత్రాలు సృష్టించాడు. ఆ బిల్డింగ్‌కు తానే యజమానినని చెప్పుకోవటం మొదలెట్టాడు. దీంతో వృద్ధ దంపతులు కోర్టును ఆశ్రయించారు. జిల్లా కోర్టు, ఢిల్లీ హైకోర్టు వారికి సానుకూలంగా తీర్పును ఇచ్చాయి. దీంతో వృద్ధ దంపతుల కుమారుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. గురువారం ఈ పిటిషన్‌పై జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఆస్తి కోసం తల్లిదండ్రులను కోర్టుకు ఈడ్చిన కుమారుడికి ధర్మాసనం మొట్టికాయలు వేసింది. 'తల్లి పాదాలు తాకి ఆశీర్వాదం తీసుకో. ఆమెను క్షమించమని కోరు' అని ఆదేశించింది. తల్లిదండ్రులను వేధించే వారికి, ఆస్తి కోసం మోసం చేసేవారికి న్యాయస్థానాల నుంచి రక్షణ ఉండదని ధర్మాసనం పేర్కొంది. భారతీయ సమాజంలో.. అన్ని మతాల్లో తల్లికి ఉన్నతస్థానం ఉందని తెలిపింది. కొడుకు పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. 60 రోజుల్లో ఇంటిని ఖాళీ చేయాలని, తల్లిదండ్రులకు పరిహారం ఇవ్వాలని స్పష్టం చేసింది.

# ఏఐ ఫేక్ వీడియోలతో మోసాలు.. ప్రజలకు ప్రియాంక గాంధీ ఆఫీస్ హెచ్చరిక..

న్యూఢిల్లీ,

సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఏఐ ఫేక్ వీడియోలను నమ్మి మోసపోవద్దని ఆమె ఆఫీస్ ప్రజలను హెచ్చరించింది. సైబర్ నేరగాళ్లు ప్రియాంక గాంధీ వాయిస్, ముఖంతో ఏఐ వీడియోలు సృష్టిస్తున్నారని పేర్కొంది. ప్రియాంక గాంధీ పేరుతో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వైరల్ అవుతున్న ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ వీడియోలను క్లిక్ చేయవద్దని ప్రియాంక గాంధీ ఆఫీస్ విజ్ఞప్తి చేసింది. సోషల్ మీడియాలో ప్రియాంక పేరుతో అనుమానాస్పద పోస్టులు కనిపిస్తే వెంటనే 'రిపోర్ట్' లేదా 'బ్లాక్' చేయాలని కోరింది. పెట్టుబడుల పేరిట జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలని ప్రియాంక గాంధీ ఆఫీస్ ప్రజలను హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఉదయం ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది.

# ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం: మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్,

ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. వారు కోరుకున్న విధంగా ఆరోగ్య సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. జులై 17 నుంచి నూతన ఈహెచ్ఎస్ సదుపాయం అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈహెచ్ఎస్ పరిధిలో 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. అర్హులందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. ఓటీపీతో హెల్త్ కార్డు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. గురువారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈహెచ్ఎస్ కింద ఏడాదికి రూ.1,056 కోట్ల బడ్జెట్ కేటాయించామని చెప్పారు. నెలకు రూ.88 కోట్ల నిధులు సమకూరుతున్నాయని వివరించారు. ఉద్యోగులు, పెన్షనర్లు 1.5 శాతం చొప్పున చెల్లింపు.. ప్రభుత్వం కూడా అంతే మొత్తం చెల్లిస్తుందని పేర్కొన్నారు. 921 ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ వైద్య సేవలు అందుతాయని అన్నారు. ఆ జాబితాలో 114 ప్రభుత్వ, 807 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 37 వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మరో 25 వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్ల ప్రీ-ఆథరైజేషన్ చేసినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు.

# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై అసెంబ్లీలో చర్చ..

ప్లాంట్ల ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

అధిక వ్యయం ప్రధాన సవాల్‌గా మారింది

కేంద్రం నిబంధనలు సడలిస్తే మరింత పెట్టుబడులు

పారిశ్రామిక వృద్ధితో భారీగా డిమాండ్

ఆయా గ్రామాల్లో మైక్రో గ్రిడ్‌ల ఏర్పాటుకు కసరత్తు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణలో ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రిజర్వాయర్లపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం సహా పలు రిజర్వాయర్లను పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా సభ్యులు సోలార్ పవర్‌పై ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి వివరణ ఇస్తూ కీలక విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని తెలిపారు. అయితే, దీనికి అధిక వ్యయం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల కారణంగా ఒక్క మెగావాట్‌కు రూ.1.30 కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. కేంద్రం నిబంధనలు సడలిస్తే పెట్టుబడులు మరింత పెరుగుతాయని భట్టి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందని.. పారిశ్రామిక వృద్ధితో డిమాండ్ భారీగా పెరుగుతోందన్నారు. మరోవైపు, విద్యుత్ సబ్సిడీల కోసం ఏటా రూ.19 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అలాగే, సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపైనా కాంగ్రెస్ సర్కార్ దృష్టి పెట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి పేర్కొన్నారు. ఈ మేరకు అమ్రాబాద్‌లో 80 గ్రామాల సోలరైజేషన్‌కు పైలట్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో మైక్రో గ్రిడ్‌ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. మరోవైపు, గిరిజన ప్రాంతాల్లో సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఇందుకోసం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతులు, ప్రజలు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. అలాగే, సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యేలకు భట్టి విక్రమార్క సూచించారు.

# శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

హైదరాబాద్,

తెలంగాణ శాసనమండలి నుంచి ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ సభ్యులు వాకౌట్ చేశారు. గురువారం మండలి ప్రారంభమైన తర్వాత 22ఎపై చర్చించాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పట్టుబట్టారు. అందుకోసం వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను శాసనమండలి చైర్మన్ తిరస్కరించారు. దాంతో బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. చైర్మన్ పోడియం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. పేపర్లు చించి గాలిలోకి ఎగరేశారు. అనంతరం మండలి నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించిన బీఆర్ఎస్ సభ్యులు బయటకు వెళ్లిపోయారు.

# మంత్రి తుమ్మలపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

హైదరాబాద్,

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేలు పాయల శంకర్, రాకేష్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. మంత్రిగా తుమ్మల చాలా బాగా పనిచేస్తున్నారని.. తాము ఇలాంటి మంత్రిని చూడలేదని పేర్కొన్నారు. ఎప్పుడైనా ఫోన్ చేసినా తుమ్మల స్పందిస్తారని.. ఆదివారం రోజున కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. పనిలో ఉన్న సమయంలో ఫోన్ ఎత్తలేకపోయినా తిరిగి కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేస్తే మంచి అని చెప్పాల్సిందేనని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. ఏదైనా సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తే ఓపికగా విని.. దాని పరిష్కారం కోసం ఫాలోఅప్ చేస్తారని బీజేపీ ఎమ్మెల్యేలు తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకూ సంబంధిత అధికారులతో మాట్లాడటంతో పాటు.. మళ్లీ ఫోన్ చేసి పరిస్థితిని వివరిస్తారని చెప్పారు. ఎప్పుడు సమస్య పరిష్కారం అవుతుందో కూడా ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తారని పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

# ఆర్టీసీని నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం: మంత్రి పొన్నం

హైదరాబాద్,

ఆర్టీసీ పేద ప్రజలకు లైఫ్ లైన్ లాంటిదని తెలంగాణ రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకార్ అభివర్ణించారు. గురువారం అసెంబ్లీలో ఆర్టీసీపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. హైదరాబాద్‌లో మినీ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని చూస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 540 ఎలక్ట్రికల్ బస్సులు నడుస్తున్నాయని వివరించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన రోజే అసెంబ్లీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం టీజీఎస్ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఆర్టీసీ డిపోలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. యాదాద్రి జిల్లాలోని వంగపల్లి మండలంలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే ఆసిఫాబాద్, కాగజ్ నగర్‌లో ఆర్టీసీ డిపోల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మిర్యాలగూడలో నూతన డిపో ఏర్పాటుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. చనిపోయిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

# మద్యం కుంభకోణం కేసులో రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డికి చుక్కెదురు



ఢిల్లీ,

ఏపీలో లిక్కర్ రవాణా కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. ముందస్తు బెయిల్ కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నారని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు. ఈడీ కస్టడీ నుంచి తిరిగి సిట్ కస్టడీకి తీసుకోవాలని సూచించింది.

**ఇది తీవ్రమైన కేసు: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**

ఇది అత్యంత తీవ్రమైన కేసని, ఇందులో రాజ్ కసిరెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నారని ధర్మాసనంలోని మిగిలిన జడ్జిలకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) కేసుతో పాటు ఇతర దర్యాప్తు సంస్థల కేసులు సమాంతరంగా విచారణ జరిపితే తప్పేమిటని నిందితుల తరపు న్యాయవాదులను సీజేఐ ప్రశ్నించారు. ఈడీ కస్టడీ ముగిసిన తర్వాత, సిట్ కస్టడీకి తీసుకునేందుకు ప్రొడక్షన్ వారెంట్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆ ప్రక్రియ ముగిసిన అనంతరం సంబంధిత కింది కోర్టులో రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. మెరిట్స్ ఆధారంగా బెయిల్ దరఖాస్తును కోర్టు పరిశీలిస్తుందని తేల్చిచెప్పింది.

# థాయ్‌లాండ్‌కు వెళ్తున్నారా?.. కొత్త రూల్స్ తెలుసుకోండి.!

ఇంటర్నెట్ డెస్క్: థాయ్‌లాండ్‌కు వెళ్లాలని ప్లాన్ చేస్తున్న భారతీయ ప్రయాణికులు కొత్త నిబంధనలను తెలుసుకోవాలి. సెప్టెంబర్ 15, 2026 నుంచి భారతీయ సాధారణ పాస్‌పోర్ట్‌దారులు వీసా లేకుండా థాయ్‌లాండ్‌లో ఉండే గడువులో మార్పు వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు పాటించాల్సిన నిబంధనలు, వెంట తీసుకెళ్లాల్సిన పత్రాలపై బ్యాంకాక్‌లోని భారత రాయబార కార్యాలయం పలు సూచనలు చేసింది.

**వీసా లేకుండానే థాయ్‌లాండ్‌కు వెళ్లొచ్చు**

భారతీయ పర్యాటకులు వీసా లేకుండానే థాయ్‌లాండ్‌కు వెళ్లవచ్చు. అయితే సెప్టెంబర్ 15 నుంచి వీసా మినహాయింపు కింద అక్కడ ఉండే గడువును 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించారు. అంటే పర్యాటకం కోసం వెళ్లే భారతీయ సాధారణ పాస్‌పోర్ట్‌దారులు ముందుగా వీసా తీసుకోవాల్సిన అవసరం లేదు. అయితే గరిష్ఠంగా 30 రోజుల వరకు మాత్రమే ఉండేందుకు అనుమతి ఉంటుంది.

**పాస్‌పోర్ట్ ఆరు నెలలు చెల్లుబాటులో ఉండాలి**

థాయ్‌లాండ్‌కు చేరుకునే తేదీ నుంచి మీ పాస్‌పోర్ట్ కనీసం ఆరు నెలలు చెల్లుబాటులో ఉండాలి. కాబట్టి ప్రయాణానికి ముందే పాస్‌పోర్ట్ గడువు తేదీని చెక్ చేసుకోవడం మంచిది. పాస్‌పోర్ట్ గడువు దగ్గరలో ఉంటే ముందుగానే దాన్ని రెన్యువల్ చేసుకోవాలి.

# షార్జా: ఎయిర్‌పోర్టులో జగిత్యాల జిల్లా ప్రవాసుడి అరెస్ట్.. విడుదలకు 'సీఎం ప్రజావాణి'లో భార్య వేడుకోలు!

**జగిత్యాల జిల్లా ప్రతినిధి ::అర్జున్ సమాచారం సెప్టెంబర్ 10::**

యూఏఈలోని షార్జా ఎయిర్‌పోర్టులో తెలంగాణలోని జగిత్యాల జిల్లాకు చెందిన ఓ గల్ఫ్ కార్మికుడు అరెస్టయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫుజైరా జైలులో మగ్గుతున్న తన భర్తను విడిపించాలని కోరుతూ బాధితుడి భార్య హైదరాబాద్‌లోని 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'లో అధికారులను వేడుకున్నారు.ఈ ఘటనకు సంబంధించిన ముఖ్య వివరాలు:బాధితుడి వివరాలు: జగిత్యాల జిల్లా, గొల్లపల్లి మండలం, లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కొత్తూరి రాజ్‌కుమార్ అనే ప్రవాస కార్మికుడు ఈ కేసులో అరెస్టయ్యాడు.ఎయిర్‌పోర్టులో అరెస్ట్: గత మార్చి 12, 2026న షార్జా ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్ వచ్చేందుకు విమానం ఎక్కుతున్న సమయంలో.. ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుని, పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం ఆయనను ఫుజైరా జైలులో ఉంచారు.ప్రజావాణిలో వినతి: రాజ్‌కుమార్ అరెస్టుకు గల కారణాలు తెలుసుకుని, దుబాయ్ కాన్సులేట్ ద్వారా లీగల్ ఎయిడ్ (న్యాయ సాయం) ఇప్పించి విడిపించాలని కోరుతూ ఆయన భార్య రజిత మంగళవారం బేగంపేట ప్రజాభవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం




సమర్పించారు.అధికారుల భరోసా: ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, దుబాయ్ సామాజిక కార్యకర్త గుండెల్లి నర్సిములు తదితరులు బాధితురాలికి మార్గనిర్దేశం చేసి ధైర్యం చెప్పారు. ఈ వినతిపై స్పందించిన ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. విద్యాసాగర్. కార్మికుడి విడుదలకు తగిన చర్యలు తీసుకోవాలని జి ఎ డి ఎన్నారై అధికారులను ఆదేశించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే మన ప్రవాస సోదరులు ప్రయాణాల సమయంలో తమ వీసా, ఫైన్స్ మరియు ఇతర చట్టపరమైన పత్రాలన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో ఒకటికి రెండుసార్లు ముందే సరిచూసుకోవాలి. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఎంబసీ లేదా కాన్సులేట్‌ను సంప్రదించాలి.

## మచ్చుపేటలో నామకరణ మహోత్సవంలో చొప్పరి సదానందం



**అర్జున్ సమాచారం, సెప్టెంబర్ 10 / ముత్తారం రిపోర్టర్**

ముత్తారం మండలం మచ్చుపేట గ్రామ సర్పంచ్ చిలివేరి జ్యోతి--లక్ష్మణ్ దంపతుల కుమార్తె నామకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం ముదిరాజ్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో పెరిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లక్కారంలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు




**ముత్తారం:**

మండలంలోని లక్కారం గ్రామంలో మాజీ ఎంపీపీ, స్థానిక సర్పంచ్ అత్తే చంద్రమౌళి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను గురువారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అత్తే చంద్రమౌళి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ, ఆమె అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి దిలీప్, ఉపసర్పంచ్ సల్లూరి రాజ్‌కుమార్, వార్డు సభ్యులు నరేష్, ప్రసాద్, కొమురయ్య, స్రవంతి, శ్రీకాంత్, కోమలత, సంపత్, స్వప్న, రవి, పద్మ, శంకర్, రాజాబాబు, గ్రామస్థులు సదానందం, రాజ్‌కుమార్, కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి నాయకుల అర్ధరాత్రి అరెస్టులు దారుణం

### ఇంటెలిజెన్స్ వైఫల్యానికి ఇదే నిదర్శనం

**జన్నారం ప్రతినిధి: అర్జున్ సమాచారం సెప్టెంబర్ 10 :**

ఖానాపూర్ : దీ=ూం (భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం) ఎలాంటి ఆందోళనకు పిలుపు ఇవ్వకపోయినా విద్యార్థి నాయకులను అర్ధరాత్రి నుంచి పోలీసులు అరెస్ట్ చేయడాన్ని దీ=ూం




నాయకులు తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని వారు ఆరోపించారు.దీ=ూం ఎలాంటి ఆందోళనకు పిలుపు ఇవ్వకుండానే విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం పోలీస్ ఇంటెలిజెన్స్ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.నిన్న అసెంబ్లీలో జరిగిన పరిణామాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం భయపడుతోందని, అందుకే విద్యార్థి నాయకులను అర్ధరాత్రి నుంచే అరెస్ట్ చేసి అక్రమంగా నిర్బంధిస్తోందని దీ=ూం నాయకులు ఆరోపించారు. బివిద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేయలేరని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును ప్రభుత్వం గౌరవించాలని వారు డిమాండ్ చేశారు.అరెస్టు అయినవారిలో.సుద్దాలమహిపాల్.మునుగురిప్రణీత్.పూసలమనోజ్.ఆడెపు రవి.చుక్కల నరేష్.శ్రీకాంత్ అమందా.సాయి రాజ్.అంజి.నవీన్.



## తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి పెన్షన్, ఇళ్ల స్థలాలు కేటాయించాలి:




**భీమారం(మంచిర్యాల),అర్జున్ సమాచారం, సెప్టెంబర్ 10:**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపునిచ్చి, పెన్షన్‌తో పాటు ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు చేయాలని భీమారం మండల ఉద్యమకారుల సంఘం (2001) నాయకులు డిమాండ్ చేశారు. మండల తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ సదానందం కి తెలంగాణ ఉద్యమకారులు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో అణచివేతకు గురైన తెలంగాణ ప్రజల హక్కులు, సంపద పరిరక్షణే ధ్యేయంగా నాడు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా శాంతియుత మార్గంలో పోరాటాలు చేశామని గుర్తుచేశారు. నాటి ఉద్యమంలో పాల్గొని ప్రభుత్వ అణచివేత చర్యలను అనుభవించిన ప్రతి ఒక్కరినీ తెలంగాణ ఉద్యమకారులుగా అధికారికంగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.భీమారం మండల కేంద్రంలో అర్హులైన ఉద్యమకారులందరికీ నివాస యోగ్యమైన భూమిని కేటాయించి, ఇళ్లను నిర్మించి ఇవ్వాలని, అలాగే జీవనోపాధి కోసం నెలనెలా పెన్షన్ సదుపాయం కల్పించి భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో భీమారం మండల ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షులు దాసరి మధునయ్య , ఉపాధ్యక్షులు దుర్గం లాజర్, గౌరవ అధ్యక్షులు పోటు మురళిధర్ రెడ్డి మరియు ఉద్యమ కారుల సంఘం గౌరవ అధ్యక్షులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వేలాలలో రూ.4.25 కోట్ల పుష్కర ఘాట్‌కు శ్రీకారం

**-పుష్కర ఘాట్ పనుల ప్రదేశాన్ని పరిశీలించిన నీటిపారుదల శాఖ అధికారులు.**

**అర్జున్ సమాచారం. సెప్టెంబర్ 10. (స్టాఫ్ రిపోర్టర్) మంచిర్యాల జిల్లా.**

జైపూర్ వేలాల, సెప్టెంబర్ 10: గోదావరి పుష్కరాలు 2027ను పురస్కరించుకొని వేలాల గ్రామపంచాయతీ పరిధిలో సుమారు రూ.4 కోట్ల 25 లక్షల అంచనా వ్యయంతో పుష్కర ఘాట్ మంజూరు అయినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం నీటిపారుదల శాఖ కార్యనిర్వహణ ఇంజినీర్ సత్యనారాయణ పుష్కర ఘాట్ నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించి పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఘాట్ నిర్మాణానికి సంబంధించిన ఏర్పాట్లను



పరిశీలించారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని పనులు చేపట్టాలని తెలిపారు.కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఉప ఇంజినీర్ రామకృష్ణ, సహాయ ఇంజినీర్లు ప్రణీత్, అఖిల, గ్రామ సర్పంచ్ డేగ స్వప్న నాగేష పాల్గొన్నారు.

## ఇందారంలో ఘనంగా పోషణ పక్షం కార్యక్రమం.

**-తల్లీబిడ్డల సంక్షేమానికి ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలి.**

**అర్జున్ సమాచారం. సెప్టెంబర్ 10. (స్టాఫ్ రిపోర్టర్) మంచిర్యాల జిల్లా.**

ఇందారం: మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చెన్నూర్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహిస్తున్న పోషణ పక్షం కార్యక్రమం గురువారం ఇందారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీ మహమ్మద్ ఫయాజ్, ఉపసర్పంచ్ శ్రీ ఎల్కటూరి శివ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. తల్లీబిడ్డల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేయాలని సర్పంచ్, ఉపసర్పంచ్ సూచించారు. తల్లులు, చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వార్డు సభ్యులు మాడుగుల శంకర్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు నళిని, తిరుమలేశ్వరి, కళ్యాణి, సహాయకులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్, విద్యార్థులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ముత్తారం వార్డు మెంబర్స్ ఫోరం నూతన కమిటీకి కాంగ్రెస్ ఘన సన్మానం



**అర్జున్ సమాచారం సెప్టెంబర్ 10. ముత్తారం, రిపోర్టర్**

ముత్తారం మండల వార్డు మెంబర్స్ ఫోరం నూతన కమిటీగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు కుక్కల చంద్రమౌళి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్యాల లక్ష్మి దేవేందర్‌లను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన వార్డు మెంబర్స్ ఫోరం నాయకులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా చొప్పరి సదానందం మాట్లాడుతూ గ్రామ స్వరాజ్య స్థాపనలో, స్థానిక సంస్థలను బలోపేతం చేయడంలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. వార్డు సభ్యుల హక్కులు, విధుల పరిరక్షణకు ఫోరం దిక్సూచిగా పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నూతన కమిటీ ముందుండాలని ఆకాంక్షించారు.నూతన అధ్యక్షుడు కుక్కల చంద్రమౌళి మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వార్డు సభ్యులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని వార్డు సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కోల విజయ్ గౌడ్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు గాదం శ్రీనివాస్, మాజీ సర్పంచులు తూటి రజిత రఫీ, రాపెల్లి రామన్న, తాటిపాముల వాకులారాణి శంకర్, మాజీ ఉపసర్పంచ్ కలవేన శ్రీనివాస్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు అనుము సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కే.వి.చారి, నూనేటి కృష్ణ, అనుము గోపాల్, అమ్ము రవి, వేల్మరెడ్డి సంజీవరెడ్డి, రాపెల్లి సురేందర్, గుడి రాములు, కలవేన గరుడాచలం, మూడేడ్ల మధుకర్, అలుగం రాజేశం, గడ్డం విద్యాసాగర్, అలుగం పాపయ్య, ఆకుల చిన్ను, కుక్కల శ్రీకాంత్, తాడవేన సంతు, ముదురుకొల్ల నగేష్, గుడికందుల కుమార్, చల్లా సదయ్య, చల్ల కుమార్, మీన్నపురం మల్లేష్, సట్ల శ్రీనివాస్, సట్ల శంకర్, తుండ్ల కొమురయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళితులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చావు డప్పు కొట్టుడే

### -- దళిత సేన డివిజన్ అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్

**అర్జున్ సమాచారం । సెప్టెంబర్ 10 । ముత్తారం రిపోర్టర్**

దళితులకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను మోసం చేస్తోందని మంథని డివిజన్ దళిత సేన అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్ ఆరోపించారు.దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర దళిత సేన క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గద్దల శంకర్‌తో కలిసి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఊట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420.అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు.దళితుల అభ్యున్నతి కోసం, సమాజంలో వారు సమానంగా జీవించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి అర్హులైన దళితులకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించిందని పేర్కొన్నారు. దళితుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు.కాంగ్రెస్ నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఊట్ల శ్రీనివాస్ విమర్శించారు. దళితులకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క దళిత కుటుంబానికీ ఆర్థిక సాయం అందించలేదని ఆరోపించారు.ఎన్నికల హామీలను అమలు చేయకపోతే రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దళితుల సమస్యల పరిష్కారం కోసం దళిత సేన నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సేన నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# సంపాదకీయం...

## రిటైర్మెంట్ కన్నా జడ్జీల అనుభవమే మిన్న

అనుభవజ్ఞులైన న్యాయమూర్తులు పదవీ విరమణ చేయడంవల్ల న్యాయపరమైన అనుభవం కోల్పోతున్నందున వారి పదవీ విరమణ వయస్సును పెంచడం ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత అవసరమని సుప్రీం కోర్టు అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా జిల్లా న్యాయవ్యవస్థలో పదవీ విరమణ వయస్సును పెంచాలని సూచిస్తోంది. దేశం మొత్తం మీద పెండింగ్ కేసుల సంఖ్య ఐదు కోట్లు దాటిపోయిన నేపథ్యంలో సుప్రీం కోర్టు ఈ ప్రతిపాదన చేయడం ఆలోచించాల్సిందే. అలా చేయకపోతే ప్రజలకు సకాలంలో న్యాయం అందించడం ఒక భ్రమగా మిగిలిపోతుందని అత్యున్నత న్యాయస్థానం హెచ్చరిస్తోంది. ఈ మేరకు జిల్లా న్యాయవ్యవస్థ లోని న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచే అంశంపై సుప్రీం కోర్టు ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ విధంగా పదవీ విరమణ వయస్సును పెంచాలని సుప్రీం కోర్టు గట్టిగా పట్టుపట్టడానికి ప్రధాన కారణం న్యాయాధికారులు సాధారణ ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ వయసులో న్యాయ వ్యవస్థలోకి ప్రవేశిస్తారని, అందువల్ల వారిని ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో నేరుగా పోల్చడం సరికాదని అభిప్రాయపడింది. అనుభవజ్ఞులైన న్యాయాధికారులను కొనసాగించడం వల్ల కేసుల పెండింగ్ తగ్గిపోతుందని భావిస్తోంది. ఈ ఏడాది మార్చి 31న, ఆ తర్వాత రిటైరైన న్యాయాధికారులకు తిరిగి విధుల్లో చేరే అవకాశం కల్పించాలని, ఒకవేళ వారు ఇతర విధుల్లో చేరని పక్షంలో ఈ వెసులుబాటు వర్తింప చేయాలని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. న్యాయవ్యవస్థకు సంబంధించి రాష్ట్రాల్లో నియామకాలు జరిగినప్పటికీ, మంజూరైన అన్ని పోస్టులూ భర్తీ కాలేదు. అందువల్ల ఉండాల్సిన సిబ్బంది సంఖ్యకు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యకు మధ్య పెద్ద తేడా కనిపిస్తోంది. భారత నాయకత్వానికి ప్రశ్నార్థకంగా బ్రిక్స్ సదస్సు న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సు పెంపుపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు రాష్ట్రాలకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. సుప్రీం కోర్టు చేసిన ఈ సూచనలకు ఇప్పటివరకు కేవలం ఏడు రాష్ట్రాలు మాత్రమే సానుకూలంగా స్పందించాయి. మిగతా రాష్ట్రాలు ఈ విషయంలో సందేహంగా ఉండటం, ఆసక్తి చూపకపోవడం జరుగుతోంది. తెలంగాణ హైకోర్టు న్యాయాధికారుల రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని సిఫారసు చేయగా, తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తోంది. తమిళనాడు ప్రభుత్వం ఈ పెంపునకు అభ్యంతరం లేదని తెలియజేసింది. తమిళనాడు హైకోర్టు కూడా రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. అయితే 60 ఏళ్ల వయస్సులో సామర్థ్యం/అర్హతను పరిశీలించే ప్రక్రియ ఉండాలని సూచించింది. న్యాయాధికారుల పదవీ విరమణ వయసు పెంపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, జమ్మూకశ్మీర్, తమ నిర్ణయంపై పునరాలోచన చేయాలని ధర్మాసనం కోరింది. ఈ రాష్ట్రాలు సంకోచించడానికి కారణం ఏమిటంటే ఈ పదవీ విరమణ వయసును పెంచడంవల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై పడే ఆర్థిక భారం గురించి అవి ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచితే రాష్ట్ర ప్రభుత్వ ఇతర శాఖల్లోని ఉద్యోగులు కూడా తమ పదవీ విరమణ వయసును పెంచాలని, సమానత్వం పేరుతో డిమాండ్ చేస్తారేమో అని ఆయా రాష్ట్రాలు భయపడుతున్నాయి.

## చాకలి ఐలమ్మ స్ఫూర్తితో బీసీల హక్కుల సాధనకు ఐక్య పోరాటం.

### –బీసీ కుల సంఘాలు ఏకతాటిపైకి రావాలి: నరెడ్ల శ్రీనివాస్

అర్జున్ సమాచారం. సెప్టెంబర్ 10. (స్టాఫ్ రిపోర్టర్) మంచిర్యాల జిల్లా.



మంచిర్యాల, సెప్టెంబర్ 10: వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బీసీ సమాజ్ జిల్లా కమిటీ, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో మంచిర్యాల ఐబీ చౌరస్తాలో కార్యక్రమం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్, రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు సంగం లక్ష్మణ్ మాట్లాడుతూ బీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఐలమ్మ చూపిన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. బీసీ కుల సంఘాలన్నీ ఐక్యంగా ముందుకు వచ్చి హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బియ్యాల సత్తయ్య, ఆకుతోట పద్మాదేవి, ఇనవంక నాగలక్ష్మి, ఎండీ హుస్సేన్, తాటిపాముల సమ్మయ్య, సంగెపు ఎల్లయ్య, పసుపునూటి కుమార్, కంచర్ల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓదెలలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

పెద్దపల్లి డెస్క్ , అర్జున్ సమాచారం, సెప్టెంబర్ : 10 :



పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో గురువారం రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ కనికిరెడ్డి సతీష్, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, తెలంగాణలో నైజాం నిరంకుశత్వానికి, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ధైర్యంతో కొట్లాడి, వారిని ఉరికించి తరిమిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె చూపిన పోరాట పటిమ, ఆత్మగౌరవం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకట లక్ష్మాన్, వార్డు సభ్యులు అప్పని తిరుపతి, గోపతి ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు చింతం కుమారస్వామి, పెరక సంఘం అధ్యక్షులు కానిగంటి ఎర్ర శంకరయ్య, మెరుగు సారంగం, నాగపూరి రవి, రామంచ అనిల్, చెరుకు శంకర్, చెరుకు శ్రీనివాస్, వంగరి చందు, తీర్థల కుమార్, రామినినేని రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. అలాగే రజక సంఘం అధ్యక్షులు పైడిపల్లి రమేష్, ఉపాధ్యక్షులు శతల్ల విష్ణు, సంఘం పెద్దలు మేడిచాల్మేల చంద్రయ్య, రామడుగు వెంకటేష్, మడికొండ వీరయ్య, శతల్ల రామస్వామి, శతల్ల శ్రీనివాస్, శతల్ల రవి, శతల్ల సమ్మయ్య, రామడుగు మల్లయ్య, శతల్ల కుమార్, మడికొండ రాకేష్, రామడుగు శ్రీనివాస్, శతల్ల వెంకటేష్, ఎలాబోతరం శ్రవణ్, మడికొండ వెంకటేష్, రామడుగు బుచ్చయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొని ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు.

## సల్ల శ్రీనివాస్ కఠినంగా శిక్షించాలి

### టీవీ వైఎస్ - వి బి ఎ రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్ డిమాండ్

అర్జున్ సమాచారం చెన్నూరు నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 10




జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం పెద్ద నక్కలపేటలో గ్రామంలో గల శ్రీ శారద విద్యానికేతన్ ఎస్ ఎస్ మోడల్ స్కూల్ ఇంగ్లీష్ మీడియం యజమాని (ప్రిన్సిపాల్) సల్ల శ్రీనివాస్ నాలుగు సంవత్సరాల దళిత అమ్మాయిపై ప్రవేట్ స్పాట్ ముడుతూ మరియు అత్యాచారం చేసినట్లు ఆరోపణలు రావడం జరిగింది. దీనిపైన పోలీస్ ఉన్నంత అధికారులు పూర్తి విచారణ జరిపి అతన్ని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎంపీ అభ్యర్థి మరియు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం (టీవీ వైఎస్) మరియు వంచిత్ బహుజన్ అగాడి (వి బి ఏ) పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు ఈరోజు గ్రామాన్ని సందర్శించి వాస్తవాలను తెలుసుకున్నట్లు తెలిపారు ఎస్ ఎస్ మోడల్ స్కూల్ అనేటువంటిది అసలు ప్రభుత్వం గుర్తింపు ఉందా లేదా అనేది అనుమానంగా ఉందన్నారు నర్సరీ నుండి ఏడవ తరగతి వరకు ఈ పాఠశాల నడుస్తున్నట్టుగా అక్కడున్న బోర్డుపైన రాసి ఉంది మరి జగిత్యాల జిల్లాల్లో ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారి మండల విద్యాశాఖ అధికారి అదేవిధంగా పాఠశాలలపై తిరుగుతున్నటువంటి విద్యాశాఖ అధికారులు ఈ పాఠశాలకు గుర్తింపు ఉందా లేదా ఉంటే రికగ్నిషన్ నెంబర్ ఎందుకు లేదు ఒకవేళ ప్రభుత్వ గుర్తింపు లేకపోతే ఇన్ని సంవత్సరాల నుండి ఆ పాఠశాల ఏ విధంగా నడుస్తుంది ముందుగా విద్యాశాఖ అధికారులైనటువంటి ఎంఈఓ గారి డిఇఓ గాని లేదా ఇతర విద్యాశాఖ అధికారుల పైన ముందుగా ఏసీబీ లేదా సిబిఐ సిబిసిఐడి అధికారులతో విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటపడతాయని చెప్పేసి గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు ఎందుకంటే గుర్తింపు లేకపోతే నర్సరీ నుండి ఏడవ తరగతి వరకు ఈ పాఠశాల ఎట్లా నడుస్తుంది మరి కింది నుంచి పై వరకు ప్రతి నెల కావచ్చు సంవత్సరానికి్కవాసు ఎంత మాములు ముడుతున్నాయి వీటన్నిటి పైన పూర్తి విచారణ జరిపించాల్సిన అవసరం జిల్లా గానీ రాష్ట్ర విద్యాశాఖ అధికారుల పైన ఉంది అదేవిధంగా ధర్మపురి స్థానిక ఎమ్మెల్యే గారు మరియు సోషల్ వెల్ఫేర్ ట్రైబల్ వెల్ఫేర్ మినిస్టర్ దీనిపైన పూర్తిగా విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది ఆరోపణలు ఎదుర్కొంటున్న సల్ల శ్రీనివాస్ ని శ్రీనివాస్ కు కొమ్ముకొస్తున్న విద్యాశాఖ అధికారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు .

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

# ఆట



## క్రికెట్ పిచ్ పై భారత్ జపాన్ ఫ్రెండ్ షిప్..

భారత్, జపాన్ దేశాల మధ్య 75 సంవత్సరాల ద్వైపాక్షిక దౌత్య సంబంధాల వేడుకలను పురస్కరించుకుని ఇరు దేశాల పురుషుల జట్లు ప్రత్యేక అంతర్జాతీయ టీ20 మ్యాచ్ లో పాల్గొననున్నాయి. ఈ మ్యాచ్ కోసం 'సుజుకి కప్' ను నిర్వహించనున్నట్లు జపాన్ క్రికెట్ అసోసియేషన్ (జేసీఏ), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సంయుక్తంగా అధికారిక ప్రకటన చేశాయి. జపాన్‌లోని తోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా సెప్టెంబర్ 22న ఈ చారిత్రాత్మక పోరును నిర్వహించనున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు 'స్పోర్ట్ 75' పేరుతో ఈ క్రీడా సంబంధాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం ఇండియా చేస్తున్న ప్రయత్నాలకు కూడా ఈ భాగస్వామ్యం ఊతమివ్వనుంది. ఆ సమయంలో జపాన్ వేదికగా జరిగే ఏషియన్ గేమ్స్ లో పాల్గొనే భారత పురుషుల జట్టులోని స్టార్ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్ వంటి ఆటగాళ్లు ఈ చారిత్రక మ్యాచ్ లో బరిలోకి ఆడనున్నారు. ఈ విశేష సందర్భంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ, "ఈ అరుదైన మ్యాచ్ లో భాగస్వామి కావడం బీసీసీఐకి ఎంతో సంతోషాన్నిస్తోంది. భారత జట్టు సరికొత్త గడ్డపై అడుగుపెట్టడానికి, జపాన్ తో పాటు తూర్పు ఆసియా ప్రాంతంలో క్రికెట్ ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ఇదొక గొప్ప అవకాశం. ఇరు దేశాల మధ్య ఉన్న చిరకాల మైత్రికి ఈ మ్యాచ్ మరింత వన్నె తెస్తుంది. సంప్రదాయ క్రికెట్ దేశాలకు ఆవల కూడా ఆటను విస్తరించడం ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ బోర్డుగా బీసీసీఐ బాధ్యత" అని తెలిపారు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ జట్టును జపాన్ హోమ్ గ్రౌండ్‌కు ఆహ్వానించడం తమ అసోసియేషన్‌కు దక్కిన గౌరవమని జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో నవోకి అలెక్స్ మియాజీ పేర్కొన్నాడు. "భారత క్రికెట్ అభిమానుల ఉత్సాహాన్ని స్వాగతించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. జపాన్ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో స్టేడియానికి వచ్చి ఆటను ఆస్వాదించి మా జట్టును ప్రోత్సహించాలి" అని అతడు వ్యాఖ్యానించాడు. ఈ ప్రత్యేక పోరు ద్వారా ఈస్ట్ ఆసియా మార్కెట్ లో క్రికెట్ క్రేజ్ ను పెంచడానికి బీసీసీఐ, జేసీఏ పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాయని తెలుస్తోంది. రాబోయే కాలంలో జపాన్ లో క్రికెట్ మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు బీసీసీఐ సాంకేతిక సహకారాన్ని కూడా అందించనుంది.

## మహమ్మద్ షమీని ధీటుగా ఎదుర్కొంటాం

### సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ వెల్లడి

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ కోసం అన్ని విధాల సిద్ధమయ్యామని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ తెలిపాడు. మహమ్మద్ షమీని సమర్థవంతంగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం చెన్నై వేదికగా ప్రారంభమయ్యే దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలో ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శనివారం మీడియా సమావేశంలో పాల్గొన్న తిలక్ వర్మ.. సౌత్ జోన్ తరఫున కేఎల్ రాహుల్ ఆడటం లేదని స్పష్టం చేశాడు. దేవదత్ పడిక్కల్‌తో పాటు సిరాజ్ బరిలోకి దిగుతున్నారని చెప్పాడు. 'సీనియర్ పేసర్ మహమ్మద్ షమీని అడ్డుకునేందుకు సిద్ధంగానే ఉన్నాం. ఈ మ్యాచ్ రసవత్తరంగానే ఉండబోతుంది. గత మ్యాచ్‌లో షమీ ఎలా బౌలింగ్ చేశాడో మేం గమనించాం. బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాడు. అతని బౌలింగ్‌ను ఎదుర్కొని సత్తా చాటుతాం. కేఎల్ రాహుల్ ఈ మ్యాచ్ ఆడటం లేదు.'అని తిలక్ వర్మ తెలిపాడు. 54 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ తలపడుతున్నాయి. ఈ ఇరు జట్లు దులీప్ ట్రోఫీ ఫైనల్లో తలపడటం ఇది రెండోసారి మాత్రం. చివరి సారిగా 1970–71 సీజన్‌లో ముంబైలోని బ్రాబోర్న్ స్టేడియంలో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో సౌత్ జోన్ 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓవరాల్‌గా సౌత్ జోన్ దులీప్ ట్రోఫీ ఫైనల్ చేరడం ఇది 24వ సారి. ఇప్పటి వరకు సౌత్ జోన్ 13 టైటిళ్లు గెలిచింది. మరోవైపు 13 ఏళ్ల తర్వాత ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్.. చివరి సారిగా 2012–13 సీజన్‌లో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఇప్పటి వరకు 8 సార్లు ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్ రెండు టైటిళ్లు మాత్రమే గెలిచింది. ఈ ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకానున్నాడు. అతని పదవీకాలంపై ఇటీవల పెద్ద చర్చే జరిగింది. అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ.. వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉంది. ఈ విషయంపై చెన్నైలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా–అగార్కర్ మధ్య సమావేశం జరగనుంది. ఇటీవల బీసీసీఐ నిర్వహించిన రివ్యూ మీటింగ్‌కు అగార్కర్ హాజరు కాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల అతను ఈ మీటింగ్‌కు దూరంగా ఉన్నాడు. ఆసియా గేమ్స్ కోసం నెట్ బౌలర్లను ఎంపిక చేయనున్నారు. మయాంక్ యాదవ్, కార్తిక్ త్యాగితో పాటు మోహ్‌సిన్ ఖాన్‌కు అవకాశం రానుంది.



## ఒక్క పరుగుతో తిలక్ వర్మ సెంచరీ మిస్

దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో సౌత్ జోన్ కేప్టెన్ తిలక్ వర్మ నిరాశకు గురి చేశాడు. చెన్నైలోని చేపాక్ స్టేడియం వేదికగా ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్ లో అద్భుత పోరాటపటిమను ప్రదర్శించాడు. ఒంటరి పోరాటంతో జట్టును ఇబ్బందుల నుంచి గట్టెక్కించినప్పటికీ.. ఒక్క పరుగు దూరంలో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. 211 బంతులను ఎదుర్కొన్న తిలక్ వర్మ.. 99 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అతను అవుట్ అయ్యాక సౌత్ జోన్ తొలి ఇన్నింగ్ ఎంతో సేపు కొనసాగలేదు. 336 పరుగులకు ఆలౌట్ అయింది. నాలుగో రోజు మధ్యాహ్నానికే ఈస్ట్ జోన్ తో 394 పరుగులు వెనుకంజలో ఉందీ జట్టు. సౌత్ జోన్ లో ఇద్దరు, ముగ్గురు మినహా మిగిలిన బ్యాటర్లెవరూ పెద్దగా రాణించలేదు. ఓపెనర్ రికి భుయ్ ఒక పరుగుకే అవుట్ అయ్యాడు. నారాయణ్ జగదీశన్– 32, దేవ్ దత్ పడిక్కల్– 62, షేక్ రషీద్– 27, స్మరన్ రవిచంద్రన్– 23, శ్రేయాస్ గోపాల్– 26 పరుగులు చేశారు. చివర్లో చామా వీ మిలింద్ 43 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. ఈస్ట్ జోన్ లో ముఖేష్ కుమార్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. మహ్మద్ షమీ, ఖురేషీ, శిఖర్ మోహన్ రెండేసి చొప్పున వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్ లో ఈస్ట్ జోన్ 708 పరుగులకు ఆలౌట్ అయింది. కేప్టెన్ ఇషాన్ కిషన్ 270 పరుగులతో తడాఖా చూపాడు. కుమార్ కుశాగ్ర 101తో చెలరేగాడు. ఈస్ట్ జోన్ కు ధీటుగా బదులివ్వలేకపోయింది సౌత్. తిలక్ వర్మ, దేవ్ దత్ పడిక్కల్, మిలింద్ మాత్రమే ప్రత్యర్థి బౌలర్లను ముప్పతిప్పలు పెట్టారు. ఈ క్రమంలో తిలక్ వర్మ శతకానికి చేరువ అయ్యాడు గానీ దాన్ని అందుకోలేకపోయాడు. 99 పరుగుల వద్ద ఉన్నప్పుడు మహ్మద్ కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో అతనికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీ ఫైనల్ లో సెంచరీకి ఒక పరుగు దూరంలో ఇలా దురదృష్టకరంగా అవుట్ కావడం విస్మయానికి గురిచేసింది. దులీప్ ట్రోఫీ ఆరంభం నుండి తిలక్ వర్మ అసాధారణంగా ఆడుతున్నాడు. అత్యుత్తమ ఫామ్‌ను కనబరుస్తోన్నాడు.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthaminagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.

# యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం

**ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్**

**రైతాంగ విస్తృత ప్రయోజనాలకై కొనసాగింపు**

**సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం..**

**శాసనమండలిలో మంత్రి తుమ్మల సమాధానం**

హైదరాబాద్,

): యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు పారదర్శకంగా, అవసరమైన మేరకు అందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. యాప్ అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, భవిష్యత్‌లో రైతులకు మరింత సులభంగా, సమర్థవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ రోజు శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు యూరియా సరఫరా, యాప్ ద్వారా బుకింగ్, కౌలు రైతుల ఇబ్బందులు, సొసైటీలకు యూరియా రవాణా చార్జీలు, సాంకేతిక సమస్యలు తదితర అంశాలను ప్రస్తావించారు. వాటిపై మంత్రి సమగ్రంగా వివరణ ఇచ్చారు. గతంలో ఆధార్ ఆధారంగా ఎరువుల పంపిణీ జరిగేదని మంత్రి తెలిపారు. అయితే సబ్సిడీపై లభించే ఎరువులు భూమిని వాస్తవంగా సాగు చేస్తున్న రైతులకే అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఎరువుల అక్రమ తరలింపు, బ్లాక్‌మార్కెటింగ్, అవసరానికి మించి నిల్వ చేసుకోవడం వంటి సమస్యలను అరికట్టడంతో పాటు, రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందేలా చేయడమే యాప్ తీసుకురావడానికి ప్రధాన ఉద్దేశమని వివరించారు. పారదర్శకంగా, అవసరమైన మేరకు సబ్సిడీ యూరియా నిజమైన రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రబీ 2025–26లో 'యూరియా బుకింగ్ యాప్'ను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణలో అమలు చేసిన ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో దీని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడానికి 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్'ను ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 04.06.2026న ప్రవేశపెట్టిన యాప్‌ను తెలంగాణలో సెప్టెంబర్ 2, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన యూరియా యాప్ స్థానంలో ప్రస్తుతం యాప్ ద్వారా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కొత్త యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సమయంలో అక్కడక్కడా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమేనని మంత్రి అన్నారు. అయితే అవి వ్యవస్థలో శాశ్వతమైన లోపాలు కావని, సాంకేతిక కారణాలతో ఏర్పడిన సమస్యలని తెలిపారు. భారత ప్రభుత్వం నియమించిన సాంకేతిక బృందం మరియు మా అధికారులు యాప్ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. రాబోయే పంట కాలాల్లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందించేందుకు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు లేని రైతులు కూడా ఎరువుల బుకింగ్ చేసుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా రైతులు ఎరువులు బుక్ చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు, రిటైల్ ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద ఉన్న వాలంటీర్ల సహకారంతో రైతులకు బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రైతు గుర్తింపు, వెరిఫికేషన్‌కు లోబడి ఈ సహాయం అందిస్తారని చెప్పారు. యాప్ ద్వారా రైతులు సులభంగా ఎరువులు బుక్ చేసుకునేలా 'మీ–సేవ' బుకింగ్‌లను కూడా అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు లేదా స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తెస్తోందన్నారు. గిడ్డంగుల నుంచి రిటైల్ విక్రయ కేంద్రాలకు ఎరువులను తరలించడానికి పట్టే సమయం, రసీదుల లెక్కింపు, స్టాక్ బదిలీ నమోదులు, వ–ూరూ సింక్రొనైజేషన్, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి కారణాలతో కొన్ని సందర్భాల్లో డిజిటల్ స్టాక్, భౌతిక స్టాక్ మధ్య తాత్కాలిక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని మంత్రి వివరించారు. ఈ సమస్యలను అధిగమించేందుకు జిల్లాల వారీగా స్టాక్ తనిఖీలు నిర్వహించాలని, డిజిటల్ రికార్డులు మరియు భౌతిక నిల్వలను క్రమం తప్పకుండా సరిపోల్చాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రాబోయే పంట కాలాల్లో రైతుల సంఖ్య పెరిగినా, ఒకేసారి పెద్ద సంఖ్యలో రైతులు యాప్‌ను వినియోగించినా ఎలాంటి సాంకేతిక అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. యాప్ సాంకేతిక బృందం ఎప్పటికప్పుడు లోడ్ టెస్టింగ్ నిర్వహిస్తోందని, అవసరానికి అనుగుణంగా సర్వర్ సామర్థ్యాన్ని ఆటోమేటిక్‌గా పెంచుకునే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. గరిష్ట వినియోగ సమయంలో కూడా రైతులకు సేవలు అందేలా సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. అనంతరం పలువురు సభ్యులు యూరియా రైతులకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండటం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. కౌలు రైతులు యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు, సాంకేతిక ఇబ్బందుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో యాప్‌ను రద్దు చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, బ్లాక్‌మార్కెటింగ్‌ను అరికట్టడం, నిజమైన రైతులకు సబ్సిడీ ఎరువులు అందించడం కోసం తీసుకొచ్చిన ఈ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. యాప్ ద్వారా ఇప్పటికే 50 లక్షలకు పైగా రైతులు ఎరువులు కొనుగోలు చేశారని మంత్రి వెల్లడించారు. ఇంత పెద్ద సంఖ్యలో రైతులు ఈ వ్యవస్థను వినియోగిస్తున్న నేపథ్యంలో, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి వ్యవస్థను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. యూరియా పంపిణీలో పారదర్శకత కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌ను ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువులను యాప్ ద్వారా విక్రయించే విధంగా ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో మొదట యూరియా పంపిణీ కోసం ప్రారంభించిన విధానాన్ని ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విస్తరించి అన్ని సబ్సిడీ ఎరువులకు వర్తింపజేస్తోందన్నారు. రాష్ట్ర యాప్ స్థానంలో కేంద్రం రూపొందించిన యాప్‌ను గత వారమే రాష్ట్రవ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమలు చేశామని తెలిపారు. గతంలో రైతులకు కేటాయించిన యూరియాను 'ఇండస్ట్రియల్ యూరియా' పేరుతో పరిశ్రమలకు తరలించిన సందర్భాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. అలాగే అవసరానికి మించి కొంతమంది యూరియాను కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ చేసుకునే పరిస్థితులు కూడా ఉండేవని చెప్పారు. ఇలాంటి అక్రమాలు, దుర్వినియోగం, బ్లాక్‌మార్కెటింగ్ జరగకుండా చూడటంతో పాటు, ప్రభుత్వం అందించే సబ్సిడీ నేరుగా నిజమైన రైతుకు చేరాలనే ఉద్దేశంతో యాప్ విధానాన్ని తీసుకొచ్చామని మంత్రి స్పష్టం చేశారు. రైతులు యూరియాపై ఎక్కువగా ఆధారపడటానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వ ఎరువుల ధరల విధానమేనని మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. యూరియాకు కేంద్ర ప్రభుత్వం అధిక సబ్సిడీ ఇస్తుండగా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల ధరలు రూ.2,000కు మించి ఉండటంతో రైతులు భూమి ఆరోగ్యాన్ని కాపాడే సమతుల్య ఎరువుల కంటే తక్కువ ధరకు లభించే యూరియా వైపు మొగ్గు చూపాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అధికంగా యూరియా వినియోగించడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు, దీర్ఘకాలంలో పంటలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడే కాంప్లెక్స్ ఎరువులను సమతుల్యంగా వినియోగించే పరిస్థితి రావాలంటే ఎరువుల ధరలను కేంద్ర ప్రభుత్వం రేషనలైజ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎరువుల ధరలను రేషనలైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని అనేకసార్లు కోరినప్పటికీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని మంత్రి తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం యూరియా కొరత లేదని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా పశ్చిమాసియాలో ఏర్పడిన యుద్ధ పరిస్థితుల కారణంగా యూరియా దిగుమతుల్లో కొన్ని అంతరాయాలు ఏర్పడి, అనుకున్న సమయానికి దేశానికి యూరియా చేరుకోని పరిస్థితులు గత సంవత్సరం, ఈ సంవత్సరం ఎదురయ్యాయని తెలిపారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తూ, రాష్ట్రానికి అవసరమైన యూరియాను తెప్పిస్తుందని అన్నారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా కేంద్రంతో నిరంతరం సమన్వయం చేస్తూ అవసరమైన సరఫరాలను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని చెప్పారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఎరువుల పంపిణీకి సంబంధించి ఒకే విధమైన వ్యవస్థ ఉంటుందని మంత్రి తెలిపారు.

# స్టైఫండ్ డబుల్..

**ఆయుష్ విద్యార్థులకు సర్కార్ గుడ్‌న్యూస్**

**స్టైఫండ్స్ భారీగా పెంచుతూ జీవో జారీ**

**సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన స్టూడెంట్స్.**

**జీవో కాపి అందజేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

హైదరాబాద్,

ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను భారీగా పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ.13,754గా ఉన్న స్టైఫండ్‌ను రూ.29,792కు పెంచారు. పీజీ విద్యార్థుల స్టైఫండ్ 34,385 నుంచి 74,482కు పెరిగింది. స్టైఫండ్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయుష్ విద్యార్థులు, డాక్టర్లు బుధవారం మధ్యాహ్నం, సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీఓ కాపీని అందజేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కసారి కూడా తమ స్టైఫండ్ పెంచలేదని, దీంతో ఆయుష్ విద్యార్థులు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటిది ఇప్పుడు అల్లోపతి మెడికోలతో సమానంగా తమ స్టైఫండ్‌ను పెంచడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయుష్ విద్యార్థులు, డాక్టర్ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వైద్యులుగా ఎదిగి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. యువతే దేశ భవిష్యత్తు..



విద్యార్థులే భావి పౌరులు అని మంత్రి అన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాదని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజంలో గుణాత్మక మార్పుకు విద్య పునాది అని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఆయుష్ వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కీలక చర్యలు చేపట్టిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించి, ప్రజలకు యోగా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఆయుర్వేదం, హోమియోపతి, యునాని విభాగాల్లో 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి, ఆయుష్ వైద్య విద్య, బోధన వ్యవస్థను మరింత బలోపేతం చేశామని పేర్కొన్నారు. సిద్ధిపేట్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేసి, ఆయుష్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేశామని తెలిపారు. కరీంనగర్‌లో రూ.15 కోట్ల వ్యయంతో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. ఈ హాస్పిటల్ ద్వారా ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తరించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ఆయుష్ ఆసుపత్రులు, క్లినిక్‌లను దశలవారీగా అప్‌గ్రేడ్ చేస్తూ, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆయుష్ వైద్య విధానాలకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా విద్యార్థులు, యువ వైద్యులు కృషి చేయాలని మంత్రి సూచించారు. ఆయుష్ వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్త చికిత్సా విధానాలు, ఔషధాలపై పరిశోధన చేసి ఆయుష్ వైద్య విధానాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. "మీరు చదువుతో ఆగిపోవద్దు.. పరిశోధన వైపు కూడా అడుగులు వేయాలి. మన సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనతో అనుసంధానం చేసి ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత యువ వైద్యులపై ఉంది" అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆయుష్ వైద్యులు కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

# తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

**ప్రత్యేక ఆహ్వానం పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**సానుకూలంగా స్పందించిన ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్**

**తెలంగాణ బియ్యం ఎగుమతుల విస్తరణకు సానుకూల స్పందన**

**మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాల కొనుగోలుపైనా ఆసక్తి**

**అంతర్జాతీయ విపణిలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత అవకాశాలు**

న్యూఢిల్లీ,

తెలంగాణను ప్రపంచ పెట్టుబడులు, వ్యవసాయ వాణిజ్యం, పారిశ్రామిక అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపే లక్ష్యంతో 2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక లి"తెలంగాణ రైజింగ్ సమ్మిట్"లికు హాజరుకావాల్సిందిగా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, ఉత్పాదక సామర్థ్యం, ఎగుమతి అవకాశాలను ఆయనకు వివరించడంతోపాటు తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లక్ష్యాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను భారీగా పెంచడం, ఇరు ప్రాంతాల మధ్య వ్యవసాయ వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ నుంచి పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన మాంస ఉత్పత్తులు, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విత్తనాల కొనుగోలుపైనా శ్రీ ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్ ఆసక్తి వ్యక్తం చేశారని తెలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలు, విస్తారమైన ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యతతో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించగలవని ఆయన పేర్కొన్నారు. "తెలంగాణ రైతు పండించిన ధాన్యానికి అంతర్జాతీయ మార్కెట్ ద్వారాలు తెరవడమే మా ప్రభుత్వ లక్ష్యం. బియ్యం ఎగుమతులు విస్తరించడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతోపాటు రైస్‌మిల్లర్లు, విత్తన కంపెనీలు, మాంస ఉత్పత్తిదారులు, ఆహారశుద్ధి పరిశ్రమలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వ్యవసాయాన్ని కేవలం జీవనాధారంగా కాకుండా ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానమైన లాభసాటి ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ సమ్మిట్ రాష్ట్ర అభివృద్ధి ఆకాంక్షలకు అంతర్జాతీయ వేదికగా నిలుస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయం, ఆహారశుద్ధి, విత్తనోత్పత్తి, ఎగుమతులు, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల రంగాల్లో తెలంగాణ––ఫిలిప్పీన్స్ మధ్య నూతన భాగస్వామ్యానికి ఈ సమ్మిట్ బలమైన పునాది వేస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# ఘనంగా కాళోజీ 112వ జయంతి వేడుకలు

హైదరాబాద్,

ఖైరతాబాద్‌లోని తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ మరియు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తదితరులు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ అసిస్టెంట్ సెక్రెటరీ ఎన్. సునీత, రీసెర్చ్ అసోసియేట్ లక్ష్మీనారాయణ మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు గొప్ప కవి మరియు ప్రజా ప్రతినిధి అని, తెలంగాణ మాండలికాన్ని ఎగతాళి చేసిన వారికి తన శక్తివంతమైన, నిర్భయమైన కవితల ద్వారా తగిన సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆంధ్ర మహాసభ కార్యకలాపాలతో ఆయన గ్రంథాలయోద్యమంలో చురుకుగా పనిచేశారని, అలాగే శాసనమండలి సభ్యునిగా కూడా సేవలందించారని గుర్తుచేశారు. ఆయన రాసిన "నా గొడవ" పుస్తకం ఎంతో ప్రజాదరణ పొందిందని, "పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది" అనే ఆయన ప్రసిద్ధ నినాదం నేటికీ ఎంతోమందికి స్ఫూర్తినిస్తోందని ఆయన అన్నారు.

# సమాచార శాఖలో మట్టి గణపతుల పంపిణీ

హైదరాబాద్,

పర్యావరణ పరిరక్షణ గాను మట్టి వినాయకుడిని పూజించాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి పేర్కొన్నారు. నేడు సమాచార పౌర సంబంధాల శాఖ ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమల పంపిణీని కమీషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముకుంద రెడ్డి మాట్లాడుతూ, పండుగలను పర్యావరణ పరిరక్షణలో భాగంగా భాధ్యతాయుతంగా జరుపుకోవాలని అన్నారు. జల వనరుల పరిరక్షణ కాలుష్య నివారణకు కేవలం మట్టి గణపతి మాత్రమే పూజించాలని పేర్కొన్నారు. ఈ ఉచిత గణపతి ప్రతిమల కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్ జగన్ తో పాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో విద్యుత్ వాహనాలకు మరింత ప్రోత్సాహం

**ఈవీ పాలసీతో పర్యావరణహిత రవాణా వ్యవస్థకు బలమైన పునాది**

**విద్యుత్ వాహనాల కొనుగోలుపై 5 శాతం రాయితీ**

**ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు**

**–రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

తాడేపల్లి

ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, పర్యావరణ పరిరక్షణ పట్ల ఉన్న నిబద్ధతతో రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని మరింతగా పెంచేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. 2024–29 సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ ద్వారా విద్యుత్ వాహనాల తయారీదారులతో పాటు కొనుగోలుదారులకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. విద్యుత్ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, రవాణా వాహనాలు, ట్రాక్టర్ల కొనుగోలుపై ఎక్స్‌షోరూమ్ ధరలో 5 శాతం వరకు రాయితీ కల్పించామని తెలిపారు. ఈ ప్రోత్సాహకం 2027 మార్చి వరకు వర్తిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో రిజిస్టర్ చేసుకునే విద్యుత్ వాహనాలకు ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు కల్పించడం ద్వారా ప్రజలు ఈవీల వైపు మళ్లేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఛార్జింగ్ మౌలిక వసతులను విస్తరించేందుకు తొలి 5,000 ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఖర్చులో 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు ప్రోత్సాహకం అందిస్తున్నామని తెలిపారు.

# దేశవ్యాప్తంగా ఈవీలకు పెరుగుతున్న ఆదరణ

దేశంలో విద్యుత్ వాహనాల విక్రయాలు వేగంగా పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఆగస్టులో దేశవ్యాప్తంగా సుమారు 2.98 లక్షల విద్యుత్ వాహనాలు విక్రయించబడటం, గత ఏడాదితో పోలిస్తే 52.9 శాతం వృద్ధి నమోదవడం ఈ రంగానికి పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమన్నారు. మొత్తం వాహన మార్కెట్‌లో ఈవీల వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరగడం భవిష్యత్ రవాణా వ్యవస్థలో విద్యుత్ వాహనాల ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో 2 లక్షల విద్యుత్ ద్విచక్ర వాహనాలు, కనీసం 10 వేల త్రిచక్ర వాహనాలు, 20 వేల కొత్త విద్యుత్ కార్లను ప్రోత్సహించడంతో పాటు ప్రజా రవాణాలో ఈవీల వినియోగాన్ని విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి 30 కిలోమీటర్లకు ఒక విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ అందుబాటులోకి తీసుకురావడం, ఈ–మొబిలిటీ నగరాల అభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం వంటి చర్యలు రాష్ట్రంలో పర్యావరణహిత రవాణా వ్యవస్థకు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంతో ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# యువకులకు వాలీబాల్ లు అందించిన యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్



**అర్జున్ సమాచారం సెప్టెంబర్ 10 బెల్లంపల్లి నియోజకవర్గ ప్రతినిధి**

కాసిపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కనుకుల రాకేష్ మొదలు పెట్టిన నషా ముక్త్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు దేవాపూర్, మద్దిమాడ యువకులకు వాలీ బాల్ లు అందించడం జరిగినది, ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ యువకులు గంజాయి డ్రగ్స్ కి అలవాటు పడకుండా క్రీడల మీద చదువు మీద ఆసక్తి చూపించాలని అలాగే యువకులు ఇతరులకు కూడా క్రీడల మీద ఆసక్తి వచ్చేలా క్రీడా నైపుణ్యం పెంచుకోవాలని అన్నారు... ఈ కార్యక్రమం లో పిసీసీ కో ఆర్డినేటర్ ( జె బి ఎం)ప్రవీణ్ బాబు,శ్రీనివాస్,సతీష్,కేశవ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

వినాయక చవితి నవరాత్రులు, నిమజ్జన వేడుకలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం లోని మినీ హాల్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన నిమజ్జన ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, వివిధ శాఖల అధికారులతో కలిసి నీటి వసతి, పారిశుద్ధ్యం, విద్యుత్తు సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదైనందున నగరంలోని చెరువుల్లో నీటి లభ్యత తక్కువగా ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. నీటి మట్టం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేయడంతో పాటు, అవసరమైన చోట్ల నిమజ్జన పాండ్లను త్వరితగతిన సిద్ధం చేయాలన్నారు. భారీ విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లు, లైటింగ్, ఇతర రక్షణ పరికరాలను ముందే అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. బంధం చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులను వేగవంతం చేయాలని, కేవలం వినాయక



నిమజ్జనానికే కాకుండా రాబోయే బతుకమ్మ పండుగతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన చెరువుల పునరుద్ధరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. నగరంలో ఏర్పాటయ్యే వినాయక మండపాలకు ఉచిత విద్యుత్తు సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా విద్యుత్ వైరింగ్ వ్యవస్థను పరిశీలించాలని పేర్కొన్నారు. మండపాల పరిసరాల్లో మున్సిపల్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ చెత్త తొలగింపు, పరిశుభ్రత, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్ల వసతులు కల్పించాలన్నారు. పూజా కేంద్రాల సమీపంలో విద్యాసంస్థలు, ప్రార్థనా మందిరాలు ఉంటే శబ్ద వ్యవస్థ (మైకులు) వినియోగంలో నిబంధనలు పాటించేలా నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్, ట్రాఫిక్, జీడబ్ల్యూఎంసీ, విద్యుత్తు, ఆరోగ్య, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు, అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, ఈవీ శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ అబూబకర్ తో పాటు పోలీస్, జీడబ్ల్యూఎంసీ, రెవెన్యూ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ అక్రమ అరెస్ట్



**పెద్దపల్లి డెస్క్ , అర్జున్ సమాచారం, సెప్టెంబర్ : 10 :**

ఉపాధి, సంక్షేమ హామీల సాధన కోసం నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి మద్దతు తెలిపినందుకు ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు, ఉద్యమకారుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్‌ను పోత్కపల్లి పోలీసులు గురువారం తెల్లవారుజామున 5 గంటలకు అరెస్ట్ చేశారు. ముందస్తు అరెస్టులో భాగంగా శ్రీకాంత్ గౌడ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోత్కపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించింది. ఏటా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డులు, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మడమతిప్పారు. నిరుపేద విద్యార్థులకు సంబంధించిన రూ. 12,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఉద్యమాలను నొక్కేయలేరని, విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు బొంగోని వెంకటేష్ గౌడ్, గడ్డం అజయ్ తదితరులు పాల్గొని పోలీసుల తీరును తీవ్రంగా ఖండించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ ఎత్తివేసి సభకు అనుమతించాలి

**కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై అనర్హత వేటు వేయాలి: తాటికొండ సీతయ్య**

గత మూడు రోజులుగా జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలను చర్చించకుండా ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య విమర్శించారు. ఎలాంటి కారణం లేకుండా బీఆర్ఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే సస్పెన్షన్‌ను ఎత్తివేసి ఎమ్మెల్యేలను సభకు అనుమతించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉంటే ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తారనే భయంతోనే వారిని సభకు దూరంగా ఉంచుతున్నారని ఆయన ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు, నిషేధిత జాబితా 22-ఏలో అక్రమంగా చేర్చిన భూముల అంశాలను సభలో ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. కేసీఆర్ మరణాన్ని కోరుకుంటున్నట్లు బహిరంగంగా వ్యాఖ్యానించిన షాద్‌నగర్



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసి అనర్హత వేటు వేయాలని సీతయ్య డిమాండ్ చేశారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు అక్రమంగా చొచ్చుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసులు పక్షపాత వైఖరిని విడనాడి అందరికీ సమానంగా చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. అధికార పార్టీకి ఒక చట్టం, ప్రతిపక్షానికి మరో చట్టం ఉండకూడదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని సీతయ్య కోరారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఆయన నాయకత్వంలో సాగిన పోరాటం ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్న విషయాన్ని ప్రజలు మరువరని అన్నారు. భవిష్యత్తులో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, పట్టణ అధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్, మండల నాయకులు గుడిపాటి వీరయ్య, గోపగాని వెంకన్న, తాళ్లపల్లి యాకయ్య, మల్లెపాక రాములు, గడ్డం సోమేశ్, పాలడుగు జలంధర్, బొజ్జ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాసిపేట మండలంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు మంచిర్యాల పి చంద్రయ్య సుడిగాలి పర్యటన

**అర్జున్ సమాచారం సెప్టెంబర్ 10 బెల్లంపల్లి నియోజకవర్గ ప్రతినిధి**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని రోజున అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు మంచిర్యాల పి .చంద్రయ్య కాసిపేట మండలంలో ఆకస్మికంగా సుడిగాలి పర్యటన చేయడం జరిగినది. అందులో భాగంగా ముందుగా ముత్యంపల్లి గ్రామపంచాయతీలోని స్పెషల్ ఇంటెన్షన్ రివిజన్ ఎంక్వయిరీ ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించడం జరిగినది. అనంతరం ముత్యం పల్లిలోని వి బి జి రామ్ జి కింద ఏర్పాటు చేయబడుతున్న ఫారం పౌండు పనులను పరిశీలించడం జరిగినది. అనంతరం వెంకటాపూర్ గ్రామపంచాయతీపరిధిలోని కొలంగూడ లో ఐటిడిఎ ద్వారా నిర్మించిన ఐకెపి,హెల్త్ మరియు గ్రామ పంచాయతీకి సంబంధించిన ఇతర రకాల సేవలు అన్ని ఒకే దగ్గర అందేలా ఏర్పాటు చేయబడినటువంటి కమ్యూనిటీ భవనాన్ని పరిశీలించడం జరిగినది. దానిని త్వరలో ఓపెన్ చేయుటకు సిద్ధంగా ఉండాలని తెలియజేయడం జరిగినది. అనంతరం దేవపూర్ గ్రామపంచాయతీలో జరుగుతున్నటువంటి చేయూత పెన్షన్ల యొక్క యాప్ ఎంక్వైరీ ప్రక్రియను పరిశీలించడం జరిగినది. తదుపరి గ్రామపంచాయతీ కార్యాలయంని సందర్శించి అక్కడ కూడా స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ ఎస్ ఐ



ఆర్ ప్రక్రియను పరిశీలించడం జరిగినది. అదేవిధంగా గ్రామపంచాయతీలో నిరంతరం జరుగుతున్నటువంటి పారిశుధ్య ప్రక్రియను ఎప్పుడు నిర్లక్ష్యం చేయవద్దని ఎప్పటికప్పుడు పారిశుధ్యం పనులు నిర్వహించాలని వర్షాకాలం సిజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగినది. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ మండల పంచాయతీ అధికారి షేక్ సఫ్దర్ అలీ మరియు ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొనడం జరిగినది.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం : సర్పంచ్ చిలుకల మంజుల, వైస్ మార్కెట్ చేర్మెన్ చింతకుంట వెంకన్న..

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం



వీరోచితంగా పోరాడి, తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన నిప్పుకణిక, మహిళాలోకానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని సర్పంచ్ చిలుకల మంజుల కొనియాడారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం గ్రామపంచాయతీ ఆవరణంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలు చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చింతకుంట్ల వెంకన్న మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ, పోరాట పటిమ తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు...మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని అన్నారు....ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అన్నబోయిన శ్రీకాంత్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిలకల వెంకన్న, రజక సంఘం నాయకులుదూది గాని వెంకటయ్య, వీరయ్య, ఎల్లేష్, పాలకవర్గ సభ్యు లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్‌యూఐ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా కొండగడుపుల ప్రవీణ్ కుమార్

సూర్యాపేట జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన కొండగడుపుల ప్రవీణ్ కుమార్ ను నియమించారు. ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జకర్, రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ స్వామి ఈ నియామకం చేపట్టారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ప్రవీణ్ కుమార్ గురువారం సాయంత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కొండగడుపుల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎల్లవేళలా విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థుల హక్కులు, సమస్యలపై పోరాడుతూ వారికి అండగా నిలుస్తానన్నారు. పార్టీ నాయకుల సహకారంతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి




తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా అవకాశం కల్పించేందుకు కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీరా రెడ్డి , భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి, సూర్యాపేట మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర రైతు సమన్వయ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధకిషన్ రావు ,ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జాఖర్,ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు యాదవెల్లి వెంకటస్వామిలకు కృతజ్ఞతలు తెలిపారు

# ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద నిల్వల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**

:

జిల్లాలోని అన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద నిల్వల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)




వి రాములు తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఏసిఎస్ఓ లతో కలిసి ఇన్‌చార్జీలు, డిఈఓలు, స్టేజ్--1, స్టేజ్--2 గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వి రాములు మాట్లాడుతూ, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఉన్న నిల్వల పంపిణీ ప్రక్రియను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత ఇన్‌చార్జీలను ఆదేశించారు. స్టాక్ తరలింపులో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. స్టేజ్--1, స్టేజ్--2 గుత్తేదారులు అవసరానికి అనుగుణంగా తగినన్ని వాహనాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకుని, అందుబాటులో ఉన్న నిల్వలను సకాలంలో తరలించాలని ఆదేశించారు. నిల్వల తరలింపు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

# సినిమా
CINEMA







## 'టాక్సిక్' ఫలితంపై యశ్ ఫస్ట్ రియాక్షన్ ఇదే..

### 'ప్రేక్షకులకే వదిలేయండి' అంటూ కీలక వ్యాఖ్యలు!

కన్నడ స్టార్ హీరో యశ్ నటించిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయిన విషయం తెలిసిందే. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన తొలి రోజున మంచి ఓపెనింగ్స్ అందుకున్నప్పటికీ.. ఆ తర్వాత అదే జోరును కొనసాగించలేకపోయింది. దీంతో సినిమా ఫలితంపై సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించకపోవడంతో నిర్మాతలకు నష్టాలు వచ్చినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే సినిమా ఫలితంపై యశ్ లేదా చిత్రబృందం నుంచి పెద్దగా స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో 'టాక్సిక్' విడుదల తర్వాత యశ్ తనతో ఏం మాట్లాడారో సినిమా డబ్బింగ్ సూపర్‌వైజర్ జయ్‌దేవ్ మోహన్ తాజాగా వెల్లడించారు.కొత్త సినిమాలు చూడండిఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన జయ్‌దేవ్ మోహన్.. 'టాక్సిక్' విడుదల తర్వాత యశ్‌తో రెండుసార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. సినిమా ఫలితం, రివ్యూలు, ప్రేక్షకుల స్పందన చూసి తాను భావోద్వేగానికి గురయ్యానని చెప్పారు. అయితే యశ్ మాత్రం ఫలితం గురించి ఎక్కువగా ఆలోచించవద్దని చెప్పినట్లు జయ్‌దేవ్ వెల్లడించారు. సినిమాను ప్రేక్షకుల తీర్పుకే వదిలేయాలని, ఇకపై చేయాల్సిన పని చాలా ఉందని యశ్ తనతో అన్నట్లు తెలిపారు.యశ్ మాటల్లో బాధను తాను అర్థం చేసుకున్నానని జయ్‌దేవ్ పేర్కొన్నారు. సినిమా కోసం ఎన్నో సంవత్సరాలు పనిచేసిన నేపథ్యంలో ఫలితం ఆశించిన విధంగా రాకపోవడం బాధ కలిగించే విషయమే అయినప్పటికీ.. చివరకు ప్రేక్షకుల నిర్ణయమే అంతిమమని ఆయన అభిప్రాయపడ్డారు.



## సమంత జీవితంలో కొత్త అధ్యాయం..

'తల్లి కావడం పూర్తిగా మార్చేస్తుంది' అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు!

దక్షిణాది నుంచి పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటి సమంత ప్రస్తుతం తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన దశను ఆస్వాదిస్తున్నట్లు తెలుస్తోంది. రాజ్ నిడిమోరును వివాహం చేసుకున్న సమంత.. త్వరలోనే తన తొలి బిడ్డకు జన్మనివ్వబోతున్నారనే వార్తలు ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచాయి. ఈ నేపథ్యంలో మాతృత్వం, మహిళల స్వతంత్ర నిర్ణయాలు, తన జీవితంలో రాబోయే మార్పుల గురించి సమంత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఇటీవలి కాలంలో సమంత మాతృత్వానికి సంబంధించిన తన ఆలోచనలను పలు సందర్భాల్లో పంచుకుంటున్నారు. తల్లి కావడం తన జీవితంలో ఎంతో పెద్ద మార్పును తీసుకురాబోతుందని ఆమె పేర్కొన్నారు. తన తొలి బిడ్డ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని, ఆ బిడ్డ తన జీవితంలో ప్రత్యేకమైన స్థానాన్ని పొందబోతుందని ఆమె చెప్పినట్లు సమాచారం.తాజాగా ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా సెప్టెంబర్ 2026 సంచిక కవర్‌పై సమంత మెరిశారు. ఈ కవర్ షూట్‌లో ఆమె విభిన్నమైన, ఆకర్షణీయమైన రూపాల్లో కనిపించారు. తెలుపు రంగు ఆఫ్-షోల్డర్ గౌను, మెజెంటా కటౌట్ గౌను, పింక్ ట్యూల్ దుస్తులు, ఎరుపు రంగు దుస్తుల్లో ఆమె చేసిన ఫొటోషూట్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. అయితే ఫొటోషూట్ కంటే ఇంటర్వ్యూలో సమంత చేసిన వ్యాఖ్యలే ఇప్పుడు ఎక్కువగా వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా మాతృత్వం గురించి మాట్లాడుతూ.. తల్లి కావడం ఒక మహిళ జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుందని అందరూ చెబుతుంటారని, ఆ మార్పును స్వీకరించడానికి తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని సమంత పేర్కొన్నట్లు సమాచారం.

## 'సర్దార్ 2' అడ్వాన్స్ బుకింగ్స్‌కు ఊహించని షాక్.. అసలు ఏమవుతుంది?

తమిళ స్టార్ హీరో కార్తీ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'సర్దార్ 2' మరికొద్ది గంటల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 2022లో విడుదలైన 'సర్దార్' సినిమాకు సీక్వెల్‌గా రూపొందిన ఈ చిత్రంపై మొదటినుంచీ భారీ అంచనాలు ఉన్నాయి. పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాపై చిత్రబృందం కూడా చాలా నమ్మకంగా ఉంది. అయితే విడుదలకు ముందు అడ్వాన్స్ బుకింగ్స్ మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోవడం ఇప్పుడు ట్రేడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఒక సినిమా సూపర్‌హిట్ అయిన తర్వాత దానికి సీక్వెల్ వస్తే.. ఆ క్రేజ్ అడ్వాన్స్ బుకింగ్స్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా మొదటి భాగం ప్రేక్షకులను మెప్పించిన సందర్భంలో రెండో భాగంపై సహజంగానే ఆసక్తి పెరుగుతుంది.కొత్త సినిమాలు చూడండి   కానీ 'సర్దార్ 2' విషయంలో ప్రస్తుతం దీనికి భిన్నమైన పరిస్థితి కనిపిస్తున్నట్లు ట్రేడ్ వర్గాల లెక్కలు చెబుతున్నాయి. విడుదలకు ముందు దేశవ్యాప్తంగా జరుగుతున్న అడ్వాన్స్ బుకింగ్స్ రూ.3 కోట్ల మార్కును కూడా దాటలేదని సమాచారం.




## సూర్య పోలీస్ స్టోరీ 'సీన్'

తమిళ అగ్ర నటుడు సూర్య ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఆయన 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్‌ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'సీన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. జితు మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్వీయ నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై జ్యోతిక, సూర్య నిర్మిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో సూర్య పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తారని సమాచారం. నజ్రియా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నస్లెన్, ఆనంద్‌రాజ్, రాజ్ ప్రియన్ ఇతర ముఖ్యపాత్రల్ని పోషిస్తున్నారు. దీపావళి సందర్భంగా నవంబర్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాతో పాటు హెచ్.వినోద్, లోకేష్ కనకరాజ్, టీజే జ్ఞానవేల్ వంటి అగ్ర దర్శకులతో వరుస భారీ చిత్రాల్లో నటిస్తున్నారు సూర్య.



## శింగనమల బొబ్బిలి రణబాలి

అగ్ర హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'రణబాలి' నిర్మాణం నుంచే అభిమానుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఈ పీరియాడిక్ డ్రామాకు రాహుల్ సంకృత్యాన్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తున్నది. రష్మిక మందన్న కథానాయిక. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. బుధవారం టీజర్‌ను రిలీజ్ చేశారు. బ్రిటీష్ పరిపాలనా కాలంలో రాక్షస రాజుగా పేరున్న సర్ థియోడర్ హెక్టార్ ప్రజల్ని పీడిస్తూ అన్నపూర్ణగా వెలిగిన నేలను కరువు సీమగా మారుస్తుంటాడు. అతన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ ప్రజలకు అండగా నిలుస్తుంటాడు రణబాలి. ఈ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలతో టీజర్ ఆద్యంతం గూజ్‌బంప్స్ తెప్పించింది. బ్రిటీష్ అధికారులకు సవాలు విసురుతూ 'శింగనమల బొబ్బిలి రణబాలిరా'.. 'ఆ కొండపైనున్న మా భద్రమల్లాడి మీద ఆన, నేను కాయలి కాసాండంగా ఒక్క మెతుకుగూడ పొలిమేర దాటదు చెప్తున్నా' అంటూ రాయలసీమ యాసలో విజయ్ దేవరకొండ చెప్పిన సంభాషణలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. 1854-1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజయ్-అతుల్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: రాహుల్ సంకృత్యాన్.





# గంజాయికి అలవాటు పడిన ముగ్గురు యువకుల కేసు నమోదు.. డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు




**భీమారం(మంచిర్యాల),అర్జున్ సమాచారం, సెప్టెంబర్ 10:**

గంజాయి వినియోగానికి అలవాటు పడిన ముగ్గురు వ్యక్తులపై భీమారం పోలీసులు కేసు నమోదు చేసి, న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు వారిని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం మండలానికి చెందిన ఎండి . హబీబ్ (భీమారం), కృష్ణ ప్రసాద్ (దాంపూర్), వినీత్ (దాంపూర్) అనే ముగ్గురు యువకులు గంజాయి తాగుతున్నట్లు గుర్తించిన భీమారం పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. అనంతరం సదరు వ్యక్తులను చెన్నూర్ గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచారు.కేసును విచారించిన గౌరవ మేజిస్ట్రేట్ గారు, ఆ యువకులకు సరైన కౌన్సెలింగ్ మరియు పునరావాసం కల్పించాలనే ఉద్దేశంతో వారిని మంచిర్యాలలోని ప్రభుత్వ డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా భీమారం ఎస్.ఐ. ఏ. రాజేందర్ మాట్లాడుతూ.. యువత గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మత్తు పదార్థాల వల్ల జీవితాలు నాశనమవుతాయని, వాటి వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు, ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలని కోరారు.

# ఆదర్శనగర్‌లో పిచ్చికుక్కల స్వైరవిహారం -- వెంటనే నియంత్రించి తొలగించాలి: కౌన్సిలర్ మేడ స్రవంతి సురేష్ రెడ్డి



**చెన్నూర్, సెప్టెంబర్ 10 (అర్జున్ సమాచారం):**


చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ్ నగర్‌లో పిచ్చికుక్కలు పెద్ద సంఖ్యలో స్వైరవిహారం చేస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. వీధుల్లో పిచ్చికుక్కల సంచారం పెరిగిపోవడంతో ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్లపైకి రావడానికి భయపడే పరిస్థితి నెలకొందని వార్డు కౌన్సిలర్ మేడ స్రవంతి సురేష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్ మేడ స్రవంతి సురేష్ రెడ్డి వార్డులోని పలు ప్రజా సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిచ్చికుక్కల కారణంగా వార్డు ప్రజలకు కుక్కకాటు ప్రమాదం పొంచి ఉందని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని వార్డులో సంచరిస్తున్న పిచ్చికుక్కలను వెంటనే పట్టుకుని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాటిని నియంత్రించేందుకు అత్యవసరంగా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. వార్డులోని ఇతర సమస్యలను కూడా కౌన్సిలర్ మేడ స్రవంతి సురేష్ రెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కుమ్మరికుంట ప్రాంతంలో తక్షణమే లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు క్లీనింగ్ పనులు చేపట్టాలని కోరారు. అలాగే వానమాముల వరదాచార్యుల చౌరస్తా మరియు తెలంగాణ తల్లి చౌరస్తాలోని హైమాస్ట్ లైట్లు పనిచేయడం లేదని, వాటికి వెంటనే రిపేర్లు చేయించి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో దర్ని సంతోష్, కుందరపు రవీందర్, చల్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రీ-సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

**అర్జున్ సమాచారం. సెప్టెంబర్ 10. (స్టాఫ్ రిపోర్టర్) మంచిర్యాల జిల్లా.**

మంచిర్యాల జిల్లా:సెప్టెంబర్ 10, 2026:రీ -సర్వే ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రీ-సర్వే ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రీ-సర్వేకు సంబంధించిన కో-రిలేషన్ రిజిస్టర్ నిర్వహణ, వివరాల నమోదు తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి సంబంధించి రికార్డుల హక్కుల నవీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఆర్.ఓ.ఆర్. లో వివరాల నవీకరణ చేపట్టేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన ప్రామాణిక విధానాల ప్రకారం అన్ని చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రీ-సర్వే ప్రక్రియలో భాగంగా భూ రికార్డుల పరిశీలన, పాత రికార్డులతో నూతన రికార్డుల అనుసంధానం, కో-రిలేషన్ రిజిస్టర్ నిర్వహణ తదితర అంశాలలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలను పరామర్శించిన చొప్పరి సదానందం





**అర్జున్ సమాచారం । సెప్టెంబర్ 10 । ముత్తారం రిపోర్టర్**

ముత్తారం మండలం పోతారం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, ఇటీవల మృతి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకుల కుటుంబాలను పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం గురువారం పరామర్శించారు.పోతారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కోటగిరి శ్రీశైలం ఇటీవల హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో తుంటి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చొప్పరి సదానందం ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతూ, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.అనంతరం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మేకల ఓదెలు సోదరుడు మేకల బొంద్యాలు, కట్ల మల్లయ్య ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెల్కల జితేందర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ బండ సమ్మయ్య, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నెత్తెట్ల కిరణ్, కాంగ్రెస్ నాయకులు చెల్కల ఓదెలు, బత్తుల మల్లేశం, చల్ల సంతోష్, గుజ్జేటి వెంకటేశ్వర్లు, బత్తుల సతీష్, కట్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీలో కలపాలి

## ఆదివాసీలపై అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలు ఆపాలి

## గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**వేమనపల్లి, సెప్టెంబర్ 10 (అర్జున్ సమాచారం):**

నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీ పరిధిలోకి తీసుకురావాలని, ఆదివాసీలపై అటవీశాఖ అధికారుల వేధింపులు, దౌర్జన్యాలను అరికట్టాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం వేమనపల్లి మండల మహాసభ మర్మల మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం మాట్లాడుతూ.. వేమనపల్లి మండలంలో ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించేందుకు అవకాశం ఉన్న అనేక గ్రామాలను ప్రభుత్వాలు ఇప్పటికీ ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించడం లేదన్నారు. దీంతో ఆదివాసీలు అభివృద్ధికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివాసీలపై అటవీశాఖ అధికారులు నిత్యం దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. హక్కు పత్రాలు కలిగిన భూముల్లోనూ వ్యవసాయం చేసుకోకుండా అడ్డుకుంటున్నారని, అక్రమ కేసులు నమోదు చేసి



ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదివాసీల హక్కులను కాపాడాలని కోరారు.ఆదివాసీ గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనేక గ్రామాలకు సరైన రహదారి, రవాణా సౌకర్యాలు లేక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని అన్నారు. రహదారుల నిర్మాణానికి అటవీశాఖ అడ్డంకులు సృష్టించకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ఆదివాసీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయని, దీంతో ప్రజలు విషజ్వరాలు, ఇతర వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ఆదివాసీ ప్రజలను వ్యాధుల బారిన పడకుండా ప్రభుత్వం తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. సభ అనంతరం వేమనపల్లి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కర్పెత గణేష్, కార్యదర్శిగా మర్మల మల్లేశ్వరి ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా భాగాల రాజన్న, తలండి గణపతి, కొడితే నారాయణ,సహాయ కార్యదర్శులుగా సీడం సమ్మక్క, దూల చంద్రు, మడే మదనయ్య ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా ఎలాది పున్నం, కొమురం శంకర్, కొమురెల్లి సాగర్, మంచాల రాజన్న, బట్టు మదనయ్య, గుడిమేత భూదయ్య, నల్లి రాజకుమార్, సీడం కిష్టయ్య, నాయిని స్వరూప, తొర్రెం సంతోష్, లగ్గామ పార్వతిలను ఎన్నుకున్నారు. మొత్తం 20 మందితో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మర్మల శంకర్, కొండపల్లి వెంకటి, సీడం పోచం, తలండి గంగారం, సీడం చంద్రయ్య, కిరణ్, మడి వెంకటి, మధునయ్య, పున్నంతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.

# హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి.

## -జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.

**అర్జున్ సమాచారం. సెప్టెంబర్ 10. (స్టాఫ్ రిపోర్టర్) మంచిర్యాల జిల్లా.**

మంచిర్యాల జిల్లా: సెప్టెంబర్ 10, 2026: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ - 2026లో మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో నోటీసుల జారీ, విచారణ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియ నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో ఓటర్లకు అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిట్టపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను



సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజన నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలని, మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. ఆసరా పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి లాగిన్ నుండి ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఆహారం నాణ్యతను పరిశీలించారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందిస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం -జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.

**అర్జున్ సమాచారం. సెప్టెంబర్ 10. (స్టాఫ్ రిపోర్టర్) మంచిర్యాల జిల్లా.**

మంచిర్యాల జిల్లా:సెప్టెంబర్ 10, 2026:సామాజిక అన్యాయాలు, దోపిడీ, అణచివేతను ఎదురించి చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, వెనుకబడిన తరగతుల శాఖ



అధికారి నీరటి రాజేశ్వరి,కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పట్టుదల నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. వెట్టి చాకిరీ, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి మహిళా చైతన్యానికి, సామాజిక న్యాయానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణేశ విగ్రహాలను పంపిణీ చేసి మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా జలవనరుల కాలుష్యాన్ని నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. రసాయనిక రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthaminagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.